క్లుప్తంగా

పర్యావరణ సమస్యలపై అవగాహన

కర్నూలు(లీగల్): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆర్డర్, కాలుష్య నియంత్రణ మండలి సమన్వయంతో న్యాయ సేవా సదన్‌లో పర్యావరణ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి డీకంపోజ్ చేయడం వలన పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చు, ఇతర వ్యర్థాల నుంచి కాలుష్యం ఎలా అవుతుందనే విషయాలను తెలియజేశారు. జిల్లా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, పర్యావరణ ఇంజినీర్ బీవై మునిస్వామి, లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, పర్యావరణశాఖ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బోధనాసుపత్రి ఏడీలకు బాధ్యతల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కళాశాల ఏడీలకు బాధ్యతలను పంపిణీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మాని ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌కు హెచ్‌ఆర్ బాధ్యతలు, ఆసుపత్రి ఏడీకి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా కళాశాల ఏడీకి వైద్యులు, ఉద్యోగులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు నిర్వహణ కేటాయించారు. ఆసుపత్రి ఏడీకి కళాశాల, ఆసుపత్రికి వచ్చే నిధుల నిర్వహణ, సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, లాండ్రీ బాధ్యతల నిర్వహణ, హెచ్‌డీఎస్, ఏహెచ్‌సీటీ ఫండ్స్, సీఎస్ఎస్ స్కీమ్స్, డీసెంట్రలైజ్డ్ బడ్జెట్, హెచ్‌ఆర్ ఫండ్స్ కేటాయింపులు చూసుకోవాల్సి ఉంటుంది.

పీజీ పరీక్షలకు 35 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. 345 మందిగాను 310 మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు.

బహిరంగ వేలాలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థకు చెందిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎగ్జిబిషన్ మైదానానికి శుక్రవారం బహిరంగ వేలాలు నిర్వహించారు. స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ మైదానాన్ని రెండు నెలల పాటు లీజుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలంలో పలువురు పాటదారులు పోటీ పడ్డారు. రూ.10 లక్షలు చెల్లించి పోటీ పడిన పాటదారులు అత్యధికంగా 29.50 లక్షలు పాడి ఎగ్జిబిషన్ మైదానాన్ని దక్కించుకున్నారు. అలాగే జొహరాపురం రోడ్డులో క్రికెట్ నెట్స్, అక్రాలిక్ సింథటిక్ టెన్నిస్ కోర్టుకు నిర్ణయించిన ధర కంటే అధికంగా గుడ్‌విల్ చెల్లించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేలాన్ని మంజునాథ్ అనే పాటదారుడు దక్కించుకున్నారు.

బీజేపీ ప్రజల పక్షం



నూతన అధ్యక్షుడు నీలకంఠకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: బీజేపీ ఎవరి పక్షమూ కాదని, ప్రజల పక్షాన నిలుస్తుందని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ పేర్కొన్నారు. బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఆయన శుక్రవారం వినాయక ఘాట్‌లోని వినాయక దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి బీజేపీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి, పార్టీ నాయకులు కాళింగి నరసింహ వర్మ, రంగస్వామి, సందడి సుధాకర్, విట్టా రమేష్, మురారెడ్డి, హరీష్‌బాబు, మహిళా మోర్చా నాయకురాలు మాలతి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సంఘ సంస్కర్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్

కర్నూలు కల్చరల్: 19వ శతాబ్దంలో మత ఛాందసవాదం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా మహిళల విద్యకై, వితంతు పునర్వివాహాలకై పోరాటం చేపట్టిన గొప్ప సంఘ సంస్కర్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్ కొనియాడారు. ఏఐడీఎస్ఓ, ఏఐఎంఎస్ఎస్, ఏఐడీవైఓ సంఘాల ఆధ్వర్యంలో మహోన్నత మానవతావాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జయంతి సందర్భంగా సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం 'సేవ్ ఎడ్యుకేషన్ - సేవ్ కల్చర్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజు, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి, ఏఐడీఎస్ఓ నగర కార్యదర్శి హెచ్.మల్లేష్, నగర నాయకులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ ఇంజినీరు మోక్షగుండం

● ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీఆర్ ఇంజినీర్లు.



ఇంజినీర్స్ డేలో మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ ఎ.ఆనందరావు

కర్నూలు(అర్బన్): భారతదేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీరు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు కె. సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య భవన్ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పీఆర్ ఇంజినీర్లు ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ మద్దన్న, పీఐయూ ఈఈ రామక్రిష్ణారెడ్డి, పీఆర్ క్యూసీ డీఈఈ రవీంద్రారెడ్డి, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ సతీష్‌కుమార్, పీఏ టు ఎస్ఈ బీ శ్రీనివాసులు, డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం మాట్లాడుతు మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన మేధస్సుతో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించారన్నారు. మైసూర్‌లోని కృష్ణరాజసాగర్ ఆనకట్టకు చీఫ్ ఇంజినీరుగా పని చేశారన్నారు. మూసీ నది వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు పథకాలను రూపొందించారన్నారు. సాంకేతిక రంగంలో ఆయన చూపిన ప్రతిభకు గుర్తింపుగా దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న లభించిందన్నారు.

ఆర్‌యూలో ..

కర్నూలు (న్యూసిటీ) : ఇంజినీర్లకు మంచి భవిష్యత్ ఉందని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. శుక్రవారం వర్సిటీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సీవీ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం

కర్నూలు సిటీ: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్‌జోన్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం పర్యవేక్షక ఇంజినీర్ రాంగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జలాశయాల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం జల వనరుల శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ జలంధర్ మాట్లాడారు. అంతకు ముందు ఇంజినీర్లు, రిటైర్డ్ ఇంజినీర్లు 30 మందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అడిషినల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, డైరెక్టర్ చిన్నస్వామి, డీఈఈ రెడ్డిపోగు చంద్రశేఖర్, రిటైర్డ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కర్నూలు(టౌన్): స్థానిక గాయత్రి ఎస్టేట్ సర్కిల్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషసాయి, షాకీర్ హుసేన్, డీఈలు గోపాలకృష్ణయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

● 5 కె మారథాన్ రన్ కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య



మారథాన్ రన్ ప్రారంభిస్తున్న మేయర్ రామయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా చేయాలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య కోరారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం స్థానిక కోల్స్ కళాశాల వద్ద 5 కె మారథాన్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని మేయర్ బీవై. రామయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ పరుగు కోల్స్ కళాశాల నుంచి రాజవిహార్, బుధవారపేట, సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు నిర్వహించారు. ఇందులో 108 మంది విద్యార్థులు, 73 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడకుండా యువతీయువకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఎయిడ్స్ బారిన పడి ఉంటే ఏఆర్‌టీ మందులు, పౌష్టికాహారంతో జీవితకాలాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ పోటీలో మొదటి బహుమతిని ఎస్టీబీసీ కళాశాల విద్యార్థి ఎ. దినకర్ (రూ.10వేలు), రెండో బహుమతి రూ.కర్నూలు డిగ్రీ కళాశాల విద్యార్థి బి. నవీన్ (రూ.7వేలు), మూడవ బహుమతిని ఎస్సార్ కేడీ కాలేజి(నంద్యాల) విద్యార్థి వి. కిశోర్ గెలుపొందారన్నారు. వీరితో పాటు మరో ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులు, స్పెషల్ కేటగిరీ కింద నాలుగు బహుమతులు మహిళలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ పీవీ రమణ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి ప్రోగ్రామ్ మేనేజర్ అలీహైదర్ దేవీశంకర్, నజీర్‌బాషా, జిల్లా క్రీడా సంస్థ అథ్లెట్స్, కోచ్‌లు, వైద్యాధికారి డాక్టర్ హకీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



ఆప్యాయంగా లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం 43వ వార్డు లోని 111, 113 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలోనే మొదటి సారి ఇంటి పట్టాలు పొందామని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు.అనంతరం వీధుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

రుణాల పంపిణీ ముమ్మరం చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): జగనన్న తోడు కింద ఈ ఏడాది డిసెంబరులోపు చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. జగనన్న తోడు, స్త్రీనిధి రుణాలపై పీడీ తన చాంబరులో సమీక్ష నిర్వహించారు. జగనన్న తోడుకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు ఒకసారి లక్ష్యాలు వస్తాయని, డిసెంబరులోపు లక్ష్యం మేరకు చిరు వ్యాపారులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలని తెలిపారు. జగనన్న తోడు 7వ విడతలో డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా 12692, మెప్మా ద్వారా 11193 మందికి... మొత్తంగా 23825 మందికి రూ.23.80 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషినల్ పీడీ శ్రీధర్‌రావు, డీపీఎం అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

17న ఎస్పీ బాలు 'స్వర నివాళి'

కర్నూలు కల్చరల్: పద్మ విభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మూడో వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీన సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'స్వర నివాళి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గాయకులు శంకర్, రఘు, జోసెఫ్ లక్ష్మయ్య, శాంసన్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని రిథమ్ మెలోడీ ఆర్కెస్ట్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ యువ గాయకులు అందరూ ఐక్యంగా ఎస్పీ బాలును ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సంగీత ప్రియులు, బాలు అభిమానులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గాయకులు, వాయిద్య కళాకారులు ప్రేమ్, జోష్, మధన్, తభిత, ప్రియాంక, రజినీ, సోమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ మహోత్సవాలను విజయవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో గణేష్ మహోత్సవ కమిటీ, సంబంధిత రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌పోర్టు, విద్యుత్ శాఖ, నగర పాలక అధికారులతో కలిసి కమిషనర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా అలాగే జరపాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో హరిప్రసాద్, టౌన్ డీఎస్పీ విజయశేఖర్, నగరపాలక అధికారులు డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు హరీష్‌బాబు, కిష్టన్న పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కర్నూలు: వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించేవారు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద పాటించవలసిన నిబంధనలను, తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను ప్రకటనలో పేర్కొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి

● జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కన్వర్జెన్సీ కింద వివిధ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్‌కు సహకరించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో కన్వర్జెన్సీ శాఖల అధికారులతో సోషల్ ఆడిట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధి నిధులతో ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత కోసం సామాజిక తనిఖీలు నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. కన్వర్జెన్సీ శాఖలకు సంబంధించి రూ.131 కోట్ల విలువ పనులకు రికార్డులు అప్పగించాల్సి ఉందని తెలిపారు సమావేశంలో హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ తదితర శాఖల అధికారులు, ఏపీడీలు పాల్గొన్నారు.

పనితీరు బాగ లేకపోతే చర్యలు తప్పవు

వివిధ మండలాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీఓలు తమ పనితీరు మెరుగు పరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని పీడీ హెచ్చరించారు. తన చాంబరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పండ్ల మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్) : జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటాలని ఆదర్శ కళాశాల కరస్పాండెంట్ బి. తిమ్మయ్య అన్నారు. ఈనెల 9, 10 తేదీల్లో తెనాలిలోని చెంచుపేటలో 4 వ రాష్ట్ర స్థాయి జంప్‌రోప్, షూటింగ్ బాల్ అండర్-18 విభాగాల్లో కళాశాలకు చెందిన మల్లికార్జున, కార్తీక్ నాయక్, అక్మల్ బంగారు, వెండి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ బి. హరికిషన్ అభినందించారు.

క్రీడా పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కల్లూరు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాణ్యం నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జ్ పాల్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీలకు భాష్యం విద్యార్థిని ఎంపిక

కర్నూలు (టౌన్) : వచ్చే డిసెంబర్ 3 వ తేదీన మలేషియా దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు 6 వ తరగతి చదువుతున్న భాష్యం విద్యార్థిని జె. భావన ఎంపికైంది. ఈ విద్యార్థినిని శుక్రవారం ఆపాఠశాల ప్రిన్సిపాల్ మధుకుమార్ అభినందించారు.

విద్యుత్ సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతుల నిర్వహణలో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కర్నూలు డివిజన్ డీఈఈ రాజ మోహన్‌రెడ్డి తెలిపారు. 33కేవీ ఫీడర్, 11కేవీ ఫోర్త్‌క్లాస్ ఫీడర్‌ల పరిధిలోని గణేష్‌నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూకాలనీ, పార్థసారథిర్స్, శ్రీవారి కుటీర్, జొహరాపురం రోడ్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రామ్‌న గర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అవసరం ఉన్నచోట ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రైతు నేస్తం

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధాన సుగంధ ద్రవ్యాలకు చెందిన మిర్చి, పసుపు సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మహానంది ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో సీఎస్ఎస్- ఎంఐడీహెచ్ కింద మిర్చి, పసుపు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సాగు పద్ధతులు, మెలకువలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు మెంబరు సుమిత్రా రాజేష్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, మహానంది ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త ఠాగూర్‌నాయక్, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, ఉద్యాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం

కర్నూలు కల్చరల్: సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సుమిత్రా రాజేష్ అన్నారు. శుక్రవారం ఆ క్లబ్ కార్యాలయంలో క్లబ్ చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. క్లబ్ ప్రెసిడెంట్ జి.కె.దేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, పాస్ట్ ప్రెసిడెంట్లు శారదా దేవి, వసుంధర మాట్లాడారు. 17వ వార్డు కార్పొరేటర్ పద్మలత హాజరై సభ్యులుగా చేరారు. క్లబ్ సెక్రెటరీ షాలిని, ఐఎస్ఓ సుబ్బలక్ష్మి, సుశీలాబాయి, లక్ష్మీదేవి తదితర పాల్గొన్నారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ కో ఆర్డినేటర్ హేమలత చెప్పారు. శుక్రవారం ఆమె నగరంలోని శరీన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉద్యోగ నగర్‌లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్య క్రమాన్ని తనిఖీ చేశారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్) : ఏపీ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీఐటీ యూ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్,రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం పున్నమి హోటల్ సమీపంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా కుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగుల అర్జీలనుసకాలంలో పరిష్కరించాలి



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో కె.మధుసూధన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల ప్రత్యేక స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు.

విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు

కర్నూలు సిటీ: ప్రపంచ ఓజోన్ డేను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కింగ్‌మార్కెట్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓజోన్ పొరపై చిత్రలేఖన, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈఓ డా.వి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ భూతాపాన్ని, కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్ఎం మౌలాలి, సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.